సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 10 । జనవరి । 2024



సంక్రాంతి సంబరాలు

ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. - 8లో



ఎన్నికల సన్నద్ధతపై..

విజయవాడలో నిర్వహించిన ఎన్నికల సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక పాల్గొన్నారు. జిల్లాలో ఏర్పాట్లను వివరించారు.

11 నుంచి 17 వరకు ట్రిపుల్ ఐటీకి సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం క్యాంపస్‌కు సెలవులు ప్రకటించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాలన ధనబాలాజీ తెలిపారు. క్యాంపస్‌లో ఆయన మంగళవారం మాట్లాడుతూ క్లాస్‌వర్క్ 18వ తేదీన పునఃప్రారంభం అవుతుందని తెలిపారు. విద్యార్థులకు ఇచ్చే ఔట్ పాసుల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

సంక్రాంతి సెలవులు పక్కాగా పాటించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో విద్యాసంస్థలు సంక్రాంతి సెలవులను పక్కాగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం అన్నారు. సంక్రాంతి పండుగ సెలవుల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లు ఈ నెల 9 నుంచి 18వరకు, అలాగే ఇంటర్మీడియెట్ విద్యను అందిస్తున్న జూనియర్ కళాశాలలు ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు సెలవులు పాటించాల్సిందేనని ఆయన స్పష్టంచేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి సెలవులను కాదని పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రత్యేక తరగతుల నిర్వహణ పేరిట మానసికంగా వేధిస్తే ఆంధ్ర రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. ఇదే విషయమై కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులకు, ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్టు గొండు సీతారాం తెలిపారు. ఈ సెలవులు అమలు చేయడంలో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఉండబోవని, ప్రభుత్వ ఆదేశాలు, కమిషన్ సూచనలు పాటించని స్కూళ్లు, కాలేజీల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలకు వెనుకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

పెట్రోల్ బంకులో నాణ్యత పరిశీలన



పెట్రోల్ బంకు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

ఎల్ఎన్ పేట: పెట్రోల్ బంకుల్లో విక్రయిస్తున్న పెట్రోల్ నాణ్యత తక్కువగా ఉంటే ల్యాబ్‌లో పరీక్షలను నిర్వహించి చర్యలు తీసుకుంటామని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రేమ మోహన్ పెట్రోల్ బంకును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్ పరీక్షల కోసం పంపించినట్లు తెలిపారు. పెట్రోల్ నాణ్యతపై ఫిర్యాదులు వచ్చినందున తనిఖీ చేశామన్నారు. ఒక పంపింగ్‌లో కొలతలు తేడా ఉన్నట్లు గుర్తించి, పంపింగ్‌ను నిలుపుదల చేశామన్నారు. ఆయనతో పాటు తహసీల్దారు ఆర్ అప్పలరాజు, మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, వీఆర్వో పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నివాసానికి చేరుకున్న స్పీకర్



ఆస్పత్రి నుంచి బయటకు వస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: స్పీకర్ తమ్మినేని సీతారాం ఆరోగ్యంగా తన నివాసానికి చేరుకున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీపీ, సుగర్ లెవెల్స్ పెరగడంతో విశాఖలోని ఓ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు అందజేశామని, సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఆమదాలవలసలో గల నివాసంలోనే స్పీకర్ ఉన్నారని, వైద్యుల సూచనల మేరకు కొన్నాళ్లు విశ్రాంతి తీసుకుంటారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, ముఖ్య నేతలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సోలార్ రూఫ్ పరిశీలన

అరసవల్లి: జిల్లా పరిషత్ కార్యాలయం పై భాగంలో 60కిలో వాట్ సామర్థ్యంతో నిర్మించిన సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పరిశీలించారు. కలెక్టర్ నిధులు రూ.20,12,400, 15వ ఆర్థిక నిధులు రూ.20,12,400 తో నిర్మించిన సోలార్ ప్యానల్స్‌ను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమె వెంట జెడ్పీ ఏఓ రామేశ్వరరావు తదితరులున్నారు.

ఐదుగురిపై పోక్సో కేసు నమోదు

కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెంకు చెందిన ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు బాలురు లైంగిక దాడికి పాల్పడినట్టు కవిటి పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 31వ తేదీన జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని కవిటి ఎస్ఐ కె.రాము తెలిపారు.

జెడ్పీ వార్షిక బడ్జెట్ రూ. 1248.51 కోట్లు



బడ్జెట్ ఆమోదంపై మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, పక్కనే సీఈఓ వెంకట్రామన్

- 2024-25 అంచనా బడ్జెట్‌కు సభ్యుల ఆమోద తీర్మానం
- ఆదాయం సకాలంలో రావాలన్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ

అరసవల్లి: జిల్లా పరిషత్ ఆదాయ, వ్యయాల ఆధారంగా 2023-24 సవరణ బడ్జెట్, 2024-25 అంచనా బడ్జెట్ ప్రతిపాదనలకు జిల్లా పరిషత్ ఆమోదం తెలిపింది. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు పిరియా విజయ అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం జెడ్పీ సమావేశ మందిరంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ సమక్షంలో జెడ్పీ అకౌంట్స్ ఆఫీసర్ రామేశ్వరరావు బడ్జెట్ ప్రతిని సమావేశంలో చదివి వినిపించారు.

ఈ మేరకు 2023-24 సవరణ బడ్జెట్ ఆదాయం రూ.1581,46,08,566 కాగా, వ్యయం రూ. 1446,32,64,608 గానూ మిగులుగా రూ. 135,13,43,958 గా పేర్కొన్నారు. అలాగే 2024- 25 గాను అంచనా బడ్జెట్‌గా ఆదాయం రూ. 1248,51,05,200 కాగా, వ్యయం రూ. 1130,16,33,396, మిగులుగా రూ. 118,34,71,804గా చూపించి ప్రతిపాదించారు. ఈ అంచనా బడ్జెట్‌లపై ఎలాంటి అభ్యంతరాలు, వివరణలు లేవనెత్తకపోవడంతో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి తదితర జెడ్పీటీసీలు బల్లలు చరిచి తమ ఆమోదాన్ని తెలియజేశారు. దీంతో 2024-25 అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రకటించారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ తదితర ఐదు విభాగాలతో పాటు జిల్లా పరిషత్‌కు వస్తున్న ఆదాయ, వ్యయాలను అంచనాలు వేసి ఇంత మొత్తంలో ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు సీఈఓ వెంకట్రామన్ తెలియజేశారు. కేవలం జెడ్పీకి సీనరేజి ఫీజు, సర్‌ఛార్జి ఆన్ స్టాంప్ డ్యూటీ, రూ.4 చొప్పున తలసరి ఆదాయంతో పాటు అద్దెలు-ఇతరత్రా మార్గాల ద్వారానే జెడ్పీకి ఆదాయం రానుందని, ఈ మేరకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులంతా సకాలంలో జెడ్పీకి ఆదాయం వచ్చేలా కృషి చేయాలని జెడ్పీ చైర్ పర్సన్ సూచించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు, విద్యుత్ శాఖ ఈఈ ఎల్‌సిహెచ్. పాత్రుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం ప్రారంభంలో ఇటీవలే మృతిచెందిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ వైవీ సూర్యనారాయణకు నివాళి అర్పించారు.

2024-25 అంచనా ఆదాయం (జిల్లా పరిషత్‌కు) ఇలా..

సీనరేజి పద్దు	రూ.9,10,43,000
సర్‌ఛార్జి ఆన్ స్టాంప్ డ్యూటీ	రూ. 11 లక్షలు
తలసరి ఆదాయం	రూ. 1,06,19,000
అద్దెలు,	
ఇతర ఆదాయాలు	రూ. 4.10 లక్షలు
ఇసుక రీచ్‌లు	రూ. 50 లక్షలు



ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ (శ్రీకాకుళం), పీఆర్‌ఐ ఈఈ (శ్రీకాకుళం,టెక్కలి, పాలకొండ), పీఐయూ ఈఈ (శ్రీకాకుళం) తరఫున అంచనా బడ్జెట్‌ల క్రోడీకరించగా వచ్చిన వివరాలివే..

వడ్డీ జమలు	రూ.1,77,36,375
ప్రజా పనులు	రూ.3,31,62,411
పెన్షన్ కాంట్రిబ్యూషన్	రూ. 1,46,74,275
మహిళా శిశు సంక్షేమం	రూ.1,83,42,844
నీటి సరఫరా, పారిశుద్ధ్యం	రూ. 306,34,62,074
హౌసింగ్	రూ. 26,46,11,270
ఇతర సాంఘిక సర్వీసులు	రూ. 93,91,481
పశుసంవర్ధక	రూ. 9.90 లక్షలు
మత్స్య పరిశ్రమలు	రూ. 2,90,67,220
భూసంస్కరణలు	రూ. 1.50 కోట్లు
గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు	రూ.32,03,49,511
భారీ నీటిపారుదల ఆర్‌అండ్ ఆర్	రూ.11,72,50,000
విద్యుత్ శక్తి (ఎసిడిపి, సిడిపి)	రూ.1,35,07,377
రోడ్లు, వంతెనలు	రూ.27,21,19,332
రోడ్లు, రవాణా	రూ. 1,76,09,130
సహాయక గ్రాంట్లు, విరాళాలు	రూ. 824,26,52,200
నష్ట పరిహారాలు, కేటాయింపులు	రూ. 3,48,29,700
పీఆర్ ఉద్యోగుల రుణాలు	రూ.3.50 లక్షలు
మొత్తం అంచనా ఆదాయం	రూ. 1248,51,05,200
అంచనా వ్యయం	రూ. 1130,16,33,396
మిగులు నిల్వ	రూ. 118,34,71,804
2024-25 జెడ్పీ సాధారణ నిధుల నుంచి ఖర్చులిలా..	
23 శాతం పనుల పద్దు	రూ.2,26,47,000
12 శాతం మంచినీటి సరఫరా	రూ. 1,18,15,800
15 శాతం ఎస్సీ సంక్షేమం	రూ. 1,47,69,800
6 శాతం ఎస్టీ సంక్షేమం	రూ. 59,07,900
15 శాతం స్త్రీ, శిశు సంక్షేమం	రూ. 1,47,69,800
4 శాతం అగంతక ఖర్చులు	రూ. 39,38,600
10 శాతం కాంట్రిబ్యూషన్ ఖర్చులు	రూ. 98,46,500
15 శాతం కార్యాలయ నిర్వహణ ఖర్చులు	రూ. 1,47,69,800
2.5 శాతం మిగులు బడ్జెట్	రూ. 25,24,900

జగనన్న తోడుకు సర్వం సిద్ధం



- 11న ఎనిమిదో విడత జగనన్న తోడు
- ఈ విడతలో 17,991 మందికి ప్రయోజనం

శ్రీకాకుళం పాతబస్టాండ్:

చిరు వ్యాపారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న తోడుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. తాజా విడత తోడు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నారు. చిరు వ్యాపారులకు, సంప్రదాయ వృత్తి దారులకు బ్యాంకు ద్వారా రూ.10వేలు వడ్డీ లేని రుణం అందజేస్తారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి సీఎం కార్యక్రమాన్ని వీక్షిస్తారు. కలెక్టర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కార్యక్రమానికి హాజరవుతారు.

పథకం ఉద్దేశమిదే..

ఎలాంటి పూచీకత్తులు లేకుండా నిరుపేద చిరు వ్యాపారులకు, సంప్రదాయ వృత్తి వ్యాపారులకు ఆర్థిక సాయంగా రూ.10,000 అందజేసి 10 నెల వారీ వాయిదాల్లో చెల్లించే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో చిరు వ్యాపారులకు వడ్డీల భారం తగ్గింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 1,10,538 మందికి గాను ఇప్పటివరకు రూ.110.53 కోట్లు రుణ ప్రయోజనం చేకూరింది. ఈ లబ్ధిదారులకు ఆరు విడతల్లో రూ. 4.97 కోట్లను వడ్డీ రాయితీ రూపంలో అందజేశారు. ఏడో విడత కాలపరిమితి పూర్తయిన వెంటనే ఈ రుణాలకు కూడా వడ్డీ రాయితీ వేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తోడు రుణం తీసుకుని సకాలంలో వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించిన ప్రతి లబ్ధిదారునికి వారి బ్యాంకు ఖాతాలో ఈ వడ్డీ రాయితీ జమ చేస్తారు. ఎనిమిదో విడత జమకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ విడతలో మొత్తం ముప్పై మండలాల్లోని 17,991 మంది లబ్ధిదారులకు రూ. 17.97 కోట్ల ప్రయోజనం చేకూరనుంది.

వ్యాపారం అభివృద్ధి చేసుకున్నాను



నా పేరు పేడాడ లక్ష్మి. నేను చాలా కాలంగా చిన్న కిరాణా దుకాణం నడుపుతున్నాను. నాకు వ్యాపారం చేసేందుకు సరిపడా పెట్టుబడి ఉండేది కాదు. జగనన్న తోడు పథకంలో నాకు తొలిసారిగా పదివేలు బ్యాంకు నుంచి రుణం ఇచ్చారు. ఆ డబ్బులతో వ్యాపారం అభివృద్ధి చేసుకున్నాను. అంతకు ముందు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పు తీసుకునేదాన్ని. ఇప్పుడు వడ్డీల బాధ తప్పింది. మరోసారి ఈ రుణం తీసుకోవాలని అనుకుంటున్నాను. ఈ పథకం చిరు వ్యాపారులకు చాలా మంచిది.

ఆర్థిక భరోసా వచ్చింది



నాకు చిన్న టీ దుకాణం ఉండేది. కిరాణా దుకాణం నడపాలని అనుకునేదాన్ని. కానీ పెట్టుబడి లేక ఇబ్బంది పడేదాన్ని. మహిళా సంఘంలో ఉన్నందున నాకు జగనన్న తోడు పథకం ఇచ్చారు. పది వేలు రావడంతో చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. గతంలో వాడిన అప్పునకు ప్రభుత్వం వడ్డీ చెల్లించింది. దీంతో నాకు చాలా ప్రయోజనం కలిగింది. – కె.పాపమ్మ

ఎనిమిదో విడతకు రెడీ



జగనన్న తోడు పథకం ఎనిమిదో విడత గురువారం ఇవ్వనున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం వైఎస్ జగన్ విజయవాడలో కార్యక్రమం నిర్వహిస్తారు. కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి జిల్లా లబ్ధిదారులకు అందిస్తారు. – డీవీ విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ

నేటి నుంచి మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోరులో మండల స్థాయి పోటీలు బుధవారం నుంచి మొదలుకానున్నాయి. ఇందుకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. తొలి దశలో జరిగిన సచివాలయ పరిధి పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు మండల స్థాయి పోటీల్లో తలపడనున్నాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్(డబుల్స్) ఇలా ఐదు క్రీడాంశాల్లో కలిపి మొత్తం 4295 జట్లను ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. టీషర్టులను కూడా పంపిణీ చేశారు. ఈ పోటీలు 23వ తేదీ వరకు కొనసాగుతాయి. అనంతరం నియోజకవర్గ స్థాయి పోటీలు జనవరి 24 నుంచి 30వ తేదీ వరకు, జిల్లా స్థాయి పోటీలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయి.

ప్రభుత్వ సెలవులు, పండగలు మినహా మిగిలిన అన్ని రోజుల్లో పోటీలు కొనసాగనున్నాయి. డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి మొదలయ్యే రెండో దశ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓలు, ఎంఈఓల నేతృత్వంలో సచివాలయ సిబ్బంది, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు, పీడీలు, పీఈటీలు పోటీలను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

'సన్నాహక సమావేశాలు నిర్వహించండి'



నరసన్నపేట: విజయవాడలో ఈ నెల 19న జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముందు చేపట్టాల్సిన కార్యాచరణపై నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల అధ్యక్షతన సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12వ తేదీ లోగా జరిగే కార్యక్రమాలకు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో కమ్యూనిటీ ఇంట్రాక్షన్ నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయం వద్ద అంబేడ్కర్ ఫొటో ఫ్రేమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించి అక్కడే సమావేశాలు నిర్వహించాలన్నారు.

'జన భగీరథ' విజయవంతం చేయాలి: కలెక్టర్



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో జనవరి 19న అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 9 నుంచి 18 వరకు 'జన భగీరథ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని, అంబేడ్కర్ స్మృతి వనంను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజయవాడలో ఆవిష్కరిస్తారని, అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా జనవరి 9 నుంచి 18వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. 'జన భగీరథ' సందర్భంగా సామాజిక న్యాయంపై అవగాహన కార్యక్రమం, రక్తదాన శిబిరాలు, అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఫొటో ఎగ్జిబిషన్లు, మారథాన్లు, వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు, గ్రామాలు, పట్టణాల్లో అంబేడ్కర్ విగ్రహాల అలంకరణ తదితర కార్యక్రమాలు చేపడతారని, ఆయా కార్యక్రమాల్లో ప్రజలంతా పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు.

నేషనల్ టెన్నీకాయిట్ పోటీలు ప్రారంభం



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



ఊర్విజవల్లి నాట్య విన్యాసం

కాశీబుగ్గ: జాతీయ స్థాయి టెన్నీకాయిట్ చాంపియన్ షిప్ క్రీడల పోటీలకు పలాస ఆతిథ్యం ఇవ్వడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో బుధవారం 47వ జాతీయ టెన్నీకాయిట్ మహిళలు, పురుషుల పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని అన్నారు. పలాస మైదానానికి ఇన్ని రాష్ట్రాల నుంచి క్రీడాకారులు రావడం సంతోషంగా ఉందన్నారు. పలాస మైదానంలో అర్ధంతరంగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభించి క్రీడాకారులకు అంకితం చేస్తామని అన్నారు. ఈ జాతీయ టోర్నమెంట్‌కు తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. టెన్నీకాయిట్ చాంపియన్ షిప్‌లో భాగంగా ఫ్లాగ్‌మార్చ్‌తో పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కేరళ, పుదుచ్చేరి, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, ఢిల్లీతో పాటు 24 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పి.వెంకటసతీష్, నిర్వాహకులు పట్ట తవిటయ్య, గూన మన్మధరావు, బద్రి గోపాల్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలతో మమేకం



సన్యాసిపేట గ్రామంలో గిరిజనుల సంప్రదాయాల గురించి తెలుసుకుంటున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్, అధికారులు

- గిరిజన గ్రామాల్లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్ పర్యటన

టెక్కలి: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్‌తో పాటు జేసీ ఎం.నవీన్‌కుమార్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు మంగళవారం టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ సన్యాసిపేట గిరిజన గ్రామంలో పర్యటించారు. గ్రామంలో గిరిజనులకు, భూ యజమానులకు మధ్య ఉన్న వివాదంపై ఆదివాసీలు ఇటీవల ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్‌ను సంప్రదించారు. ఈ మేరకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్ గ్రామంలో పర్యటించారు. ముందుగా గిరిజనులు వీరికి స్వాగతం పలకగా.. అనంతరం వివాదాస్పద భూములను పరిశీలించారు. గిరిజనులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంత నాయక్ మాట్లాడుతూ.. గ్రామంలో భూ యజమానులకు చెందిన భూముల్లో గత కొన్ని దశాబ్దాలుగా సాగు చేస్తున్న గిరిజన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. భూ యజమానులు ఎలాంటి భూ అమ్మకాలు చేయకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చారు. గిరిజనుల కోసం ప్రభుత్వమే భూమి కొనుగోలు చేయాలనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. దీంతో గిరిజన రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తహసీల్దారు కె.ప్రవల్లికప్రియ, ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, జీసీసీ మేనేజర్లు సంధ్యారాణి, నర్సింహులు, గిరిజన సంఘాల నాయకుడు వి.యోగి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల పరిశీలన..

మెళియాపుట్టి: ఏకలవ్య పాఠశాల నెలరోజుల్లో వినియోగానికి రావాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ అన్నారు. ఆయన మంగళవారం మెళియాపుట్టి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవన సముదాయాలను పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యం కలిగేలా ఉంటే సహించేది లేదన్నారు.పాఠశాలలోని గదులను పరిశీలించారు. ఆవరణ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా నిర్మాణం చేయాలని తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

పాతపట్నం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత్ నాయక్ అన్నారు. మంగళవారం పాతపట్నం సీహెచ్‌సీని ఐటీడీఏ పీఓ కల్పన కుమారి, జేసీ నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమల్, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు భారతితో కలిసి అనంత్ నాయక్ పరిశీలించారు. రోగులకు వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావుతో మాట్లాడి గిరిజన ప్రాంతాల నుంచి ఎనీమియా రోగులు ఆస్పత్రికి వస్తున్నారా అని ఆరా తీశారు. వైద్యులు సమయపాలన పాటించాలని, ఇక్కడకు వచ్చిన రోగులకు బయటకు రిఫర్ చేయవద్దన్నారు.



ఆస్పత్రిలో సూపరింటెండెంట్ కృష్ణారావుతో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషనర్ సభ్యుడు అనంత్ నాయక్

గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గిరిజన సంక్షేమానికి అంకితభావంతో పనిచేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జాతీయ షెడ్యూలు తెగల కమిషన్ సభ్యులు అనంత నాయక్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన జిల్లా అధికారులతో గిరిజన సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత నాయక్ మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజనులే అడవికి హక్కుదారులు అనే విషయంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. గిరిజనుల సమస్యలను క్షేత్ర స్థాయి సిబ్బంది తెలుసుకుని పరిష్కరించాలన్నారు. జిల్లాలో భూమిలేని ఎస్టీ వ్యవసాయ కూలీల వివరాలు తమకు అందించాలని సూచించారు. గిరిజనాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వివరించారు.

రైతులకు న్యాయం జరిగేలా పరిహారం



పోర్టు రైల్వే మార్గం నిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి రైల్వే మార్గానికి భూములిస్తున్న రైతులకు న్యాయం జరిగేలా పరిహారం ఇస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. సంతబొమ్మాళి మండలం కాశీపురం, కోటపాడు గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులతో మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రైల్వే మార్గానికి భూములిస్తున్న రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో సంతబొమ్మాళి తహసీల్దారు కె.చలమయ్య, సబ్ కలెక్టర్ కార్యాలయం డీటీ పద్మావతి, కాశీపురం, కోటపాడు గ్రామాల నుంచి ఎల్.ఎల్.నాయుడు, కోత మధు, కోత సతీష్, ఎ.షణ్ముఖమూర్తి, డి.ఉమాపతి, జి.వెంకటరావు, ఎం.ఆనందరావు, పి.మౌళి, సీహెచ్ నారాయణరావుతో పాటు రైతులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం


చెక్ అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల సాయుధ దళంలో పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ డి.కేశవరావు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు రూ.లక్ష తక్షణ సాయాన్ని పోలీస్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఆర్.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, రాష్ట్ర అసోసియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడి గ్రామసభలు వద్దు

- పక్కాగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాల్సిందే
- 'స్థానిక' సంస్థలకు అత్యధికంగా బడ్జెట్ కేటాయింపు
- పీఆర్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ వెల్లడి


మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

అరసవల్లి: గ్రామ పంచాయతీల స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపించవద్దని, మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహించవద్దని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ వనరుల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) తయారీ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన అభివృద్ధికి తగినట్లు కచ్చితమైన ప్రణాళికలు తయారు చేస్తేనే తదనుగుణంగా కేంద్రం నుంచి నిధులు మంజూరవుతాయని స్పష్టం చేశారు. నిధుల వినియోగం చాలా కీలకమని, ఇంతవరకు సీఎఫ్ఎంఎస్ ఉండేదని, ఇప్పుడు పీఎఫ్ఎంఎస్ విధానం అమల్లో ఉందని..ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మునుపెన్నడూ లేని విధంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి గ్రామీణాభివృద్ధి ప్రణాళికలకు రూ.10 వేల కోట్లు వరకు బడ్జెట్ కేటాయిస్తోందని..అంతా అప్రమత్తంగా ఉంటే సక్రమంగా నిధులను వినియోగించుకునే వీలుంటుందన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో 602 పనులను కేంద్ర ప్రభుత్వమే గుర్తించిందని, వీటికి తగిన ప్లాన్లు సిద్ధం చేసుకోవాలన్నారు.

- జెడ్పీ సీఈఓ, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడం కీలకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ కమిషనర్ సూచన మేరకు గుర్తించిన తొమ్మిది అంశాల్లో ఒకదాన్ని ఎంపిక చేసుకుని కనీసం 25 శాతం పనులను, 25 శాతం నిధులను సక్రమంగా ఖర్చు చేసేలా ప్రణాళికలు తయారుచేసుకోవాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో తయారు చేసిన ప్రణాళికలు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో కచ్చితంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో డీపీఎంలు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. జీపీడీపీ ప్లాన్లు తయారు చేయడం, అప్‌లోడ్‌లు చేసే బాధ్యత మండల పరిషత్‌లలో ఏఓలు, గ్రామ పంచాయతీల్లో ఈఓపీఆర్‌డీలదని, వీటిని డీఎల్‌పీఓలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు కచ్చితంగా పనులకు ఎస్టిమేషన్లు ఇవ్వాలన్నారు. గత పొరపాట్లతో జిల్లాలో చాలా వరకు నిధులు మిగిలిపోయాయని, కచ్చితమైన అంచనాలతో ప్రణాళిక తయారు చేసుకుంటే గ్రాంట్‌గా ఇచ్చిన ప్రతిపైసా వినియోగమవుతుందన్నారు.
- జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్లానింగ్ సక్రమంగా లేకపోవడంతో ఇప్పటివరకు రూ.6.30 కోట్లు వరకు నిధులు వినియోగించకుండా మిగులుగా ఉన్నాయని చెప్పారు. వీటిని మార్చి నెలాఖరులోగా వినియోగిస్తేనే మరో విడత నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ పి.వెంకటరాజు మాట్లాడుతూ శిక్షణలో అంశాలను మాస్టర్ ట్రైనీల ద్వారా తెలుసుకుని ఈ నెల 17 నుంచి 24వ తేదిలోగా జీపీడీపీ తయారు చేయించి గ్రామసభల ద్వారా ఆమోదం పొంది, ఇ-గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో ఈనెల 31లోగా అప్‌లోడ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ పి.వెంకటరాజు, డీపీఎంలు కిషోర్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు బూటకం

- మంత్రి సీదిరి అప్పలరాజు


మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలుగుదేశం అధినేత చంద్రబాబు కొత్త నాటకాలకు తెర తీస్తున్నారని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. మందస పట్టణంలో మంగళవారం జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి చివరకు జనసేనతో జతకట్టి, కాంగ్రెస్ పార్టీ ఆశీస్సులతో ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల్లో నమ్మకం లేకపోవడంతో వారిని నమ్మించడానికి నానా కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. జన్మభూమి కమిటీల పాలనకు, వైఎస్సార్ సీపీ పథకాలను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. గతంలో ఎవరో ఒకరు మరణిస్తే పింఛను వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదని, అర్హులందరికీ మంజూరవుతుందని చెప్పారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీలన్నీ బూటకాలేనని దుయ్యబట్టారు. మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలని, సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని మంత్రి చెప్పారు. ఎన్నో ఏళ్లు పాలించామని చెబుతున్న గౌతు కుటుంబం ఈ ప్రాంతాన్ని గాలికొదిలేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, ఎంపీటీసీ కంచి బెహరా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, గిన్ని తిరుపతిరెడ్డి, శానాపతి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయస్థూపం సాక్షిగా ప్రజారంజక పాలన


విజయస్థూపం వద్ద కేక్ కట్ చేస్తున్న సాయిరాజ్, రామారావు

ఇచ్ఛాపురం రూరల్: జనం గుండెచప్పుడు వింటూ.. దగా పడ్డ ప్రజల కన్నీళ్లు తుడుస్తూ ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ విజయస్థూపం సాక్షిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర తుది ఘట్టానికి మంగళవారంతో ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి వద్ద నిర్మించిన విజయస్థూపం వద్ద కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి టీడీపీ చీకటి పాలన నుంచి ప్రజల్ని విముక్తులను చేసేందుకు జగనన్న చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు కోట్లాది మంది ప్రజలు జేజేలు పలికారని, బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్నదాతలను అక్కున చేర్చుకొని నవరత్నాల పథకాల ద్వారా 98.8 శాతం హామీలు నెరవేర్చి జనం మదిలో నిలిచిపోయారని వివరించారు. మరో 30ఏళ్ల వరకు ప్రజలంతా తమ వెంటే ఉంటూ జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, ఇచ్ఛాపురం, కంచిలి జెడ్పీటీసీలు ఉప్పాడ నారాయణమ్మ, ఇప్పిలి లోలాక్షి, వైస్ ఎంపీపీలు డి.వివేకానందరెడ్డి, డి.గురుమూర్తి, ఏఎంసీ చైర్మన్ ఎస్.బాబూరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, మండల సమన్వయకర్తలు పి.రాజశేఖరరెడ్డి, కె.ప్రకాష్, వి.మృత్యుంజయరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, జేసీఎస్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సంక్రాంతి సంబరాలకు రావికంటిపేట మైదానం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. మంగళవారం క్రీడా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు జనవరి 11, 12 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఔత్సాహిక మహిళలకు 12న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీలకు జశ్వంత్

టెక్కలి: ఈ నెల 24 నుంచి 28 వరకు రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు టెక్కలి ఎస్ఆర్ఆర్ కబడ్డీ క్లబ్‌కు చెందిన దండుపాటి జశ్వంత్ ఎంపికైనట్లు కోచ్ నీలయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ క్లబ్ అధ్యక్షుడు దోని బుజ్జి క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందజేశారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాము, పీఈటీలు శ్రీనివాసరావు, ప్రకాశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరికుప్పలు దగ్ధం


సీతంపేటలో కాలిపోయిన ధాన్యం

జి.సిగడాం: మండలంలోని సీతంపేటలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో వరికుప్పలు దగ్ధమయ్యాయి. వరి కుప్పలు ఆడుతున్న యంత్రం ద్వారా నిప్పురవ్వలు చెలరేగడంతో కల్లంలో ఉన్న మిగిలిన కుప్పలకు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో శాసపు సత్యానికి చెందిన 6 ఎకరాల వరి గడ్డి, 20 బస్తాల ధాన్యం, లెంక సన్యాసికి చెందిన 40 బస్తాల ధాన్యం, శాసపు పాపినాయుడుకు చెందిన 3 ఎకరాల ధాన్యం, కుప్పలు కాలిబూడిదయ్యాయి. నాలుగు నెలల పడిన కష్టమంతా బుగ్గిపాలైందని రైతులు విలపిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల విలువైన ధాన్యం కాలిపోయాయని బాధితులు తెలిపారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నీలమ్మకు విప్లవ జోహార్లు అర్పిస్తూ మావోయిస్టుల లేఖ

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం పెదవంకకు చెందిన సీపీఐ(మావోయిస్టు) ఆంధ్రా-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్ తల్లి చెల్లూరి నీలమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమెకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నట్లు జోనల్ కమిటీ కార్యదర్శి నేత గణేష్ పేరిట లేఖ విడుదల చేశారు. నీలమ్మ అనేక పోరాటాల్లో పాలుపంచుకుంటూ కుటుంబ సభ్యులను సైతం ప్రత్యక్షంగా పరోక్షంగా భాగస్వాములను చేశారని గుర్తు చేశారు. మావోయిస్టులకు వసతి, భోజనాలు కల్పించి అండగా నిలవడంతో పాటు తమకు ఆర్థికంగా కూడా చేయూతనిచ్చారని, నీలమ్మ కోరుకున్న సమసమాజ స్థాపన నెరవేరే వరకు విప్లవ పక్షాన నిలబడతామని గణేష్ పేర్కొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

గార: మండల కేంద్రం గారలోని వేంకటేశ్వరస్వామి, షిర్డీ సాయినాథాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. షిర్డీ ఆలయంలో చెవిదుద్దులు, వెండి వస్తువులు, వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళసూత్రంతో పాటు హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించింది. ఈ ఘటనలపై ఆలయ నిర్వాహకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

- ఆర్‌జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి


అధికారుల నివాస సముదాయం పనులు పరిశీలిస్తున్న చాన్సలర్ కె.సి.రెడ్డి, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్య బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్‌జీయూకేటీ ఎస్ఎంపురం క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. భవన నిర్మాణాలు పరిశీలించి అకడమిక్ వ్యవహారాలు, పాలనా అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌జీయూకేటీ నాలుగు క్యాంపస్‌లకు నాక్ బీ+ గ్రేడు వచ్చిందని, భవిష్యత్తులో 'ఏ' గ్రేడ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ప్రీ యూనివర్సిటీ రెండేళ్లు, ఇంజినీరింగ్ మూడేళ్లు కలిపి 5500 మంది విద్యార్థులకు వసతి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్‌లకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, గేట్ ప్రవేశ పరీక్షకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, ఆర్.కె.వ్యాలీ కడప, ఒంగోలు, నూజివీడు క్యాంపస్‌ల్లో 133 కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టులు, 61 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏడాది వ్యవధికి నియామకాలు ఉంటాయని, అవసరం బట్టి పొడిగింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, డీన్ మోహన్‌కృష్ణ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీఈ వెంకటరెడ్డి, వర్సిటీ ఇంజినీర్లు తేజ్‌కిరణ్, సురేష్ పాల్గొన్నారు.

ఎంఈవోల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

మండల విద్యా శాఖాధికారుల(ఎంఈవో) సంఘం జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. శ్రీకాకుళంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో జరిగిన ఈ సమావేశంలో ఎంఈవో-1, ఎంఈవో-2లు సంయుక్తంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ఒకే సంఘంగా ఏర్పాటయ్యారు. జి.సిగడాం ఎంఈవో ఎ.రవి పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. శ్రీకాకుళం జిల్లా మండల విద్యాశాఖాధికారుల సంఘ అధ్యక్షునిగా జె.చిన్నవాడు (సంతబొమ్మాళి), ప్రధాన కార్యదర్శిగా పి.దాలినాయుడు (నరసన్నపేట), కోశాధికారిగా యు.శాంతారావు (నరసన్నపేట), రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.పున్నయ్య (ఎచ్చెర్ల), గౌరవాధ్యక్షుడిగా జి.రాజేంద్రప్రసాద్ (ఆమదాలవలస), ఉపాధ్యక్షులుగా కె.రాంబాబు (హిరమండలం), సీహెచ్.తిరుమలరావు (పాతపట్నం) ఎన్నికయ్యారు. శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శిగా ఎం.మురళీకృష్ణ (లావేరు), టెక్కలి డివిజన్ కార్యదర్శిగా జి.చిన్నారావు (టెక్కలి) ఎన్నికయ్యారు. జిల్లాలోని 30 మండలాల నుంచి 58 మంది ఎంఈవోలు హాజరయ్యారు.

సంక్రాంతి సంబరాలు


అధ్వాన్నంపేట ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల వేషధారణ

వాడాడ కూడలి వద్ద ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు సంప్రదాయ వేషధారణతో ఆకట్టుకున్నారు. జి.సిగడాం మండలం సీతంపేట, అధ్వాన్నంపేట పాఠశాలల్లోనూ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

–శ్రీకాకుళం కల్చరల్/జి.సిగడాం


ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు


సీతంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారుల సందడి